ముషీరాబాద్‌లో కాంగ్రెస్ విజయం తథ్యం

- రూ. లక్షల కోట్లు దోచుకున్న కేసీఆర్ కుటుంబం
- బీఆర్ఎస్ పాలనపై ప్రజలు విరక్తి చెందిన తెలంగాణ సమాజం
- ముషీరాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్
- అట్టహాసంగా అంజన్‌కుమార్ నామినేషన్ దాఖలు

ముషీరాబాద్/కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్ భారీ ర్యాలీ నిర్వహించి అట్టహాసంగా నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ ప్రారంభానికి ముందు అడిక్‌మెట్ హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భారీ ర్యాలీని ప్రారంభించారు.



ఓపెన్ టాప్ జీప్‌లో నామినేషన్ వేసేం దుకు వెళ్తున్న అంజన్‌కుమార్‌యాదవ్

- రాంనగర్ గుండు, రాంనగర్ చౌరస్తా, ఫిష్‌మార్కెట్ మీదుగా ముషీరాబాద్ చౌరస్తా, భోలక్‌పూర్ హౌస్, పద్మశాలి కాలనీ, గంటల గ్రౌండ్, సబర్మతినగర్, అరుందతినగర్, అశోక్‌నగర్, ఇందిరాపార్కు, బండ మైసమ్మ కాలనీ వరకు వందలాది మంది కాంగ్రెస్ మద్దతుదారులతో భారీ ర్యాలీ నిర్వహించి ముషీరాబాద్ రిటర్నింగ్ కార్యాలయంలో నియోజకవర్గ ఎన్నికల అధికారి వి. లక్ష్మీనారాయణకు నమినేషన్ పత్రాలను అందజేశారు.
- ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణలో బీఆర్ఎస్ పాలన పట్ల ప్రజలు విరక్తి చెందారని, తెలంగాణలో రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. ముషీరాబాద్‌లో కాంగ్రెస్ జెండా ఎగురడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.
- ముషీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప నియోజకవర్గానికి బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు చేసింది ఏమీలేదని ఎద్దేవా చేశారు. ముషీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ చేసిన అభివృద్ధి పనులకు బీఆర్ఎస్ పార్టీ ప్యాచ్‌వర్కులు చేసుకుంటూ అభివృద్ధి తామే చేసినట్లుగా చెప్పుకుంటుందని విమర్శించారు.
- ముషీరాబాద్ నియోజకవర్గానికి కాంగ్రెస్ పార్టీకి అవినాభావ సంబంధం ఉందని, గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా సేవలు అందించిన టి.అంజయ్య, దీర్ఘ కాలం కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడిగా పనిచేసిన కృపారావు ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందినవారని తెలిపారు.
- బీఆర్ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలైన దళిత బీసీ మైనార్టీ బంధులు, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, అర్హులైన ప్రజలకు ఎవ్వరికి అందలేదని విమర్శించారు. కొద్ది మంది టీఆర్ఎస్ కార్యకర్తలకే అందజేసి రాష్ట్రమంతా అందజేసిన ట్లుగా ప్రచారం చేసుకుంటున్నారని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వం మిగులు బడ్జెట్‌గా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గతంలో 10 సంవత్సరాలుగా సికింద్రాబాద్ పార్లమెంటు సభ్యుడిగా నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ ఎన్నో అభివృద్ధి కార్యాక్రమాలు చేసినట్లు తెలిపారు. మంత్రులు, ఎమ్మెల్యేలకే ముఖ్యమంత్రి కేసీఆర్ అపాయింట్‌మెంట్ ఇవ్వడని, తెలంగాణలో సామాన్య ప్రజల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చన్నారు. ధరని పోర్టల్‌తో వందల ఎకరాలు కబ్జా చేసినట్లు తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. మాజీ కార్పొరేటర్లు కల్పనా యాదవ్, వాజీద్ హుస్సేన్, కెనడి రాజు, కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులు ఎం. అనిల్‌కుమార్ యాదవ్, ఏ బ్లాక్ అధ్యక్షుడు వి.డి.కృష్ణ, బీ బ్లాక్ అధ్యక్షుడు అంజియాదవ్, ముషీరాబాద్ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సంగపాక వెంకట్, పార్టీ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



నామినేషన్ దాఖలు చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అంజన్‌కుమార్ యాదవ్

అనుబంధాన్ని వీడకండి

- బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి కృష్ణయాదవ్



అంబర్‌పేట: అంబర్‌పేట ప్రజలకు బీజేపీకి ప్రత్యేక అనుబంధం ఉందని బీజేపీ అభ్యర్థి, మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్ అన్నారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా గోల్నాక డివిజన్ జైస్వాల్ గార్డెన్‌లో విస్తృతంగా తన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పేరు పేరునా ఓటర్లను ఆయన పలకరిస్తూ బీజేపీకి ఓటు వేయాలని ఆయన కోరారు. తాను గతంలో చేసిన అభివృద్ధిని చూడాలని ఓటర్లను అభ్యర్థించారు. కార్పొరేటర్ అమృత, చింతల శ్రీనివాస్ ముదిరాజ్, రవీందర్‌గౌడ్, చంద్రకాంత్ యాదవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

16న దివ్యాంగుల మహాధర్నా

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ఈ నెల 16వ తేదీన నిర్వహించే చలో ముంబయి దివ్యాంగుల మహాధర్నాను జయప్రదం చేయాలని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ జాతీయ కన్వీనర్ వల్లభనేని ప్రసాద్, రాష్ట్ర నాయకులు వి.భారతి, కాటమోని వెంకటేష్‌గౌడ్‌లు తెలిపారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డెఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... దివ్యాంగులకు రూ. 10 వేల పెన్షన్, నిరుద్యోగ భృతి రూ. 4 వేలు ఇవ్వాలని, చట్టసభల్లో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో పాటు మరో 20 డిమాండ్లతో కూడిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ముంబయిలో మహాధర్నా నిర్వహిస్తున్నామని వారు తెలిపారు.

అంజన్‌కుమార్ నామినేషన్‌కు తరలిన పార్టీ శ్రేణులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ముషీరాబాద్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థి ఎం.అంజన్‌కుమార్‌యాదవ్ నామినేషన్‌కు రాంనగర్ డివిజన్‌లోని నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. బుధవారం ముషీరాబాద్ మండల కార్యాలయంలో అంజన్‌కుమార్‌యాదవ్ వేలాది మందితో ర్యాలీ నిర్వహించి తన నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్‌కు బాగ్‌లింగంపల్లి డివిజన్‌లోని కాంగ్రెస్ పార్టీ సీనియర్‌నాయకులు లోకేష్‌యాదవ్, రవిశేఖర్, శ్రీధర్, కుమార్‌నాయక్, నరేష్‌నాయక్, పవన్, జబ్బార్, నరేష్, ప్రేమ్ తదితరులు ర్యాలీగా వెళ్లారు.



రాష్ట్రంలో బీజేపీకి అంత సీన్ లేదు

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



బాగ్‌అంబర్‌పేటలో బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్‌తో ప్రచారం చేస్తున్న మంత్రి తలసానికి హారతి పడుతున్న మహిళలు

అంబర్‌పేట: రెండు సీట్లు గెలువని భారతీయ జనతా పార్టీ పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతోందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ విమర్శించారు. బుధవారం బాగ్ అంబర్‌పేటలో బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్‌కు మద్దతుగా ఆయన ఎన్నికల ప్రచారం పాల్గొన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పాటుపడే బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేయాలని మంత్రి ఓటర్లను కోరారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి అంబర్‌పేట అడ్డా అని ప్రచారం చేసుకునే అతను ఇప్పుడు ఎక్కడ ఉన్నాడని తలసాని ఎద్దేవా చేశారు. పార్లమెంటు సభ్యుడిగా కిషన్‌రెడ్డి సికింద్రాబాద్‌కు ఒక లక్ష రూపాయాలు కూడ ఖర్చుచేయలేదని తలసాని విమర్శించారు. అంబర్‌పేటను అన్ని విధాలా అభివృద్ధి చేసిన కాలేరు వెంకటేశ్‌ను భారీ మేజారిటీతో గెలిపించాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. బీఆర్ఎస్ పార్టీని గెలిపిస్తే తాజగా అమలవుతున్న పథకాలు రెట్టింపు అవుతాయని ఆయన హామీ ఇచ్చారు. ప్రచారంలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంబర్‌పేటలో కాంగ్రెస్ జెండా ఎగురబోతోంది

- పార్టీ అభ్యర్థి రోహిణ్‌రెడ్డి



నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి డాక్టర్ రోహిణ్‌రెడ్డి

అంబర్‌పేట: అంబర్‌పేటలో కాంగ్రెస్ జెండా ఎగురబోతుందని ఆ పార్టీ అభ్యర్థి రోహిణ్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం వేలాది మందితో కలిసి ఆయన భారీ ర్యాలీగా వెళ్లి అంబర్‌పేట సీపీఎల్ రోడ్‌లోని ఎన్నికల రిటర్నింగ్ కార్యాలయంలో నామినేషన్ ధాఖలు చేశారు. మాజీ ఎంపీ వి.హనుమంతారావు, పార్టీ సీనియర్ నాయకులతో కలిసి ఆర్‌ఓ అపర్ణకు తన ఎన్నికల నామినేషన్ పత్రాలను అందించారు. అనంతరం ఆయన మాట్లాడతూ అంబర్‌పేటలో కాంగ్రెస్‌కు ఓటు వేసి ఒక్క అవకాశం ఇవ్వాలని ఆయన కోరారు. తన వెంట నామినేషన్‌కు వచ్చిన స్పందన స్ఫూర్తితో ఎన్నికల్లో విజయం సాధిస్తానని పేర్కొన్నారు. బీఆర్ఎస్, బీజేపీ రెండు, మూడు స్థానాల కోసం పోటీ పడుతాయన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒకటే అని అది ప్రజలు గమనించారని రోహిణ్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్‌కు సంగిశెట్టి జగదీష్ రాజీనామా

- బీఆర్ఎస్‌లో చేరికకు రంగం సిద్ధం



ముషీరాబాద్: ముషీరాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి మరో ఎదురు దెబ్బ తగిలింది. నిన్నగాక మొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నగేష్‌ముదిరాజ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరగా బుధవారం ముషీరాబాద్ నియోజకవర్గానికే చెందిన టీపీసీసీ ఉపాధ్యక్షుడు సంగిశెట్టి జగదీష్ ఆ పార్టీకి రాజీనామా చేయడం చర్చనీయంశంగా మారింది. రామ్‌విలాస్ పాశ్వాన్ నేతృత్వంలోని లోక్ జన్ భక్తి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న సంగిశెట్టి జగదీష్ అప్పటి దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి సమక్షంలో ఆ పార్టీ రాష్ట్ర శాఖను కాంగ్రెస్‌లో విలీనం చేసి ఆయన కూడా కాంగ్రెస్‌లో చేరారు. కొద్ది కాలానికే వైఎస్ మరణించడంతో కాంగ్రెస్‌లో ఆయనకు పెద్దగా గుర్తింపు రాలేదు. అయినా కాంగ్రెస్‌లోనే ఉంటూ ఏఐసీసీ ప్రొటోకాల్ బాధ్యతలను నిర్వహిస్తు రాష్ట్ర పీసీసీలో ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 2023లో ఎలాగైనా తాను పుట్టిపెరిగిన ముషీరాబాద్ నుంచి పోటీ చేయాలని పట్టుదలతో ఉండి ఏఐసీసీ నేతలను పలుమార్లు కలిసి తన ఆకాంక్షను వివరించారు. అయినా చివరి నిమిషంలో తనకు టికెట్ ఇవ్వకుండా అంజన్‌కుమార్‌కు టికెట్ కేటాయించడంతో ఆయన తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. రెండు రోజుల క్రితం తాను ముషీరాబాద్ నుంచి తప్పకుండా పోటీ చేస్తానని కాంగ్రెస్ పార్టీ రెబల్‌గా నామినేషన్ దాఖలు చేస్తానని ప్రకటించారు.

రంగంలోకి దిగిన బీఆర్ఎస్...

ఈ విషయాన్ని పసిగట్టిన బీఆర్ఎస్ నేతలు పద్మశాలీ కమ్యూనిటీకి చెందిన ఎల్.రమణ ద్వారా పావులు కదిపారు. పలుమార్లు ఆయనతో చర్చించి బీఆర్ఎస్‌లోకి రావాలని ఆహ్వానించారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ కూడా అందుకు అంగీకరించడంతో బీఆర్ఎస్ నేతల సూచనల మేరకే బుధవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశం పెట్టి తాను రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించి రేవంత్‌రెడ్డిపై తీవ్ర విమర్శలు చేశారు.

సంగిశెట్టి నివాసానికి బీఆర్ఎస్ నేతలు...

ముషీరాబాద్‌లోని సంగిశెట్టి నివాసానికి బుధవారం రాత్రి బీఆర్ఎస్ నాయకులు ఎల్. రమణ, దాసోజు శ్రవణ్‌కుమార్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ వచ్చారు. ఆయనను బీఆర్ఎస్‌లో చేరాలని ఆహ్వానించారు. విద్యావంతులైన మీకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని హామీ ఇచ్చారు. దీంతో సంగిశెట్టి కేటీఆర్ సమక్షంలో నేడో, రేపో బీఆర్ఎస్‌లో చేరడమే మిగిలింది.

స్వాతంత్య్ర సమరయోధుడు సాయిని వెంకటేశం మృతి



సాయిని వెంకటేశం (ఫైల్)

అంబర్‌పేట్: ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు, సీనియర్ న్యాయవాది సాయిని వెంకటేశం(94) బుధవారం మరణించారు. రెండు రోజుల క్రితం అనారోగ్యానికి గురైన ఆయనను కుటుంబ సభ్యులు విద్యానగర్‌లోని శారదాంబా ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతుండగా గుండె పోటు రావడంతో మరణించారు. ఆయన మృతికి పద్మశాలీ సంఘం నేతలు సంతాపం తెలిపారు. అఖిల భారత పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, ఇంజినీరింగ్ విభాగం అధ్యక్షుడు డాక్టర్ పుట్ట పాండురంగయ్య, గ్రేటర్ హైదరాబాద్ పద్మశాలీ సంఘం అధ్యక్షుడు కత్తుల సుదర్శన్‌రావు, సీనియర్ న్యాయవాది వనం విశ్వనాథ్, వనం దుశ్యంతల, అంబర్‌పేట నియోజకవర్గం పద్మశాలీ సంఘం అధ్యక్షుడు పల్కాల కృష్ణ, తదితరులు నివాళులు అర్పించారు. ఆయన మృతి పద్మశాలీ సంఘాలకు తీరనిలోటు అని విచారం వ్యక్తం చేశారు.

'పైరవీలతోనే పార్టుటైం అధ్యాపకుల ఉద్యోగాలు'

ఉస్మానియా యూనివర్సిటీ: నింబంధనలను ఉల్లంఘించి పైరవీలు చేసే వారికే ఓయూ పార్టుటైం అధ్యాపక ఉద్యోగాలు లభిస్తున్నాయని డాక్టర్ జ్యోతిపద్మజా ఆరోపించారు. తనకు జరిగిన అన్యాయంపై గత నాలుగు రోజులుగా భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న ఆమె నియామకాలపై అనేక ఆరోపణలు చేశారు. ఇటీవల ఓయూ కెమిస్ట్రీ విభాగంలో జరిగిన పార్టుటైం అధ్యాపకుల నియామకాలలో అక్రమాలు జరిగాయన్నారు. సీసీ కెమెరాలు లేకపోవడంతో ఇంటర్వ్యూ సమయంలో తనను అవమాన పరిచేలా ప్రొఫెసర్లు నవ్వుకున్నారని జ్యోతిపద్మజా ఆరోపించారు. గోల్డ్‌మెడల్స్, పీహెచ్‌డీ, బోధన అనుభవం గల అభ్యర్థులను విస్మరించి రాత పరీక్ష, ఇంటర్వ్యూలకు హాజరు కాకున్నా కేవలం పైరవీలు చేసిన వారినే ఉద్యోగాలలో నియమించారన్నారు. ఉద్యోగాల భర్తీలో జరిగిన అక్రమాలపై విచారణ జరిపించి తనకు న్యాయం చేయాలని రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు.

ఆరె కులాన్ని ఓబీసీలో చేర్చాలని ప్రధానికి వినతి



ప్రధానికి విన్నవిస్తున్న చెట్టిపల్లి శివాజీ

అంబర్‌పేట్: ఆరె కులాన్ని ఓబీసీ జాబితాలో చేర్చాలని ఆ కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చెట్టిపల్లి శివాజీ ప్రధానమంత్రి నరేంద్రమోదీని కోరారు. బీసీ గర్జనకు నగరానికి విచ్చేసిన సందర్భంగా ఎల్‌బీ స్టేడియంలో కలిసి వివరాలు తెలియజేశామని చెట్టిపల్లి శివాజీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న తమ కులం రాష్ట్రంలో బీసీ జాబితాలో ఉన్నా కేంద్రంలో ఓబీసీ జాబితాలో లేకపోవడంతో అన్యాయానికి గురవుతున్నామని ప్రధానికి వివరించారు. దీనిపై ప్రధాని స్పందించి త్వరలోనే మీ సమస్య పరిష్కారం అవుతుందని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటా

బీఆర్ఎస్ అభ్యర్థి ముఠాగోపాల్



బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభాకర్, ముఠా గోపాల్

చిక్కడపల్లి: తనను మరోసారి ఆశీర్వదిస్తే అన్ని వర్గాల ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని ముషీరాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్ డివిజన్ బీఆర్ఎస్ కార్యాలయాన్ని బుధవారం నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ ఎంఎస్ ప్రభాకర్ వైజంక్షన్ వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ... బీఆర్ఎస్‌కు భారీ మెజార్టీని అందించడమే ధ్యేయంగా ప్రతి కార్యకర్తా కృషి చేయాలన్నారు. ఎమ్మెల్సీ ప్రభాకర్ మాట్లాడుతూ... ఇప్పటివరకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించి ఓటు అడగాలని సూచించారు. మాజీ కార్పొరేటర్‌లు ముఠా పద్మనరేశ్, ఎం.పద్మజ, డివిజన్ అధ్యక్షుడు రాకేష్, నాయకులు జైసింహ, పీఎస్ శ్రీనివాస్, బొట్టు శ్రీనివాస్, అజయ్‌ముదిరాజ్ (డివిజన్ ఎన్నికల ఇన్‌చార్జీలు), శ్రీకాంత్, బీఎస్ శ్రీనివాస్‌యాదవ్, ఎక్కాల కన్నా, పాశంరవి, ముచ్చకుర్తి, పద్మ, ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్‌గుప్తా, ఎస్టీ ప్రేమ్, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు



రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన మురళీకృష్ణ, చిట్టెడి నర్సింహారెడ్డి

నల్లకుంట: తెలంగాణ ఉద్యమకారుడు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, బీసీ జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు కె.పి.మురళీకృష్ణ, పార్టీ అంబర్‌పేట నియోజకవర్గం మాజీ ఇంచార్జి చిట్టెడి నర్సింహారెడ్డి ఆ పార్టీ సభ్యత్వానికి, పార్టీకి రాజీనామా చేశారు. బుధవారం తన అనుచరులతో కలిసి అంబర్‌పేట కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సి.రోహిణ్‌రెడ్డి ఆధ్వర్యంలో టీపీసీసీ చీఫ్ ఎ.రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పిన రేవంత్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం నల్లకుంటలో మురళీకృష్ణ మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో ఉద్యమకారులకు గుర్తింపు లేదన్నారు. ఉద్యమకాలకు అడుగడుగనా అవమానాలే జరిగాయని చెప్పారు. రాష్ట్రంలో ఏర్పడబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని ఆయన జోష్యం చెప్పారు. కాంగ్రెస్‌లో చేరిన నాయకులు కె. రవి కుమార్, ఆర్. నర్సింగ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి హరీష్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన టీడీపీ అధికార ప్రతినిధి



మంత్రి హరీష్ రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన రాగిఫణి బిల్డర్ ప్రవీణ్

నల్లకుంట: టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, అంబర్‌పేట నియోజకవర్గం ఇంచార్జీ రాగిఫణి బిల్డర్ ప్రవీణ్ ఆ పార్టీకి, పార్టీ సభ్యత్వానికి రాజీనామ చేశారు. బుధవారం తన అనుచరులతో కలిసి రాష్ట్ర మంత్రి తన్నీరు హరీష్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికి గులాబీ కండువాలు కప్పిన మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... అన్ని సర్వేలు బీఆర్ఎస్ గెలుపు ఖాయమని చెబుతున్నాయని, సీఎం కేసీఆర్ పాలనపై ప్రజలకు ఉన్న చెక్కు చెదరని విశ్వాసానికి ఈ సర్వేలు నిదర్శనమన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని కుయుక్తులు పన్నినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. అనంతరం బిల్డర్ ప్రవీణ్ నల్లకుంటలో మాట్లాడుతూ... రాష్ట్రంలో ముఖ్య మంత్రి కేసీఆర్ పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులమైన తామంతా బీఆర్ఎస్‌లో చేరామన్నారు. అంబర్‌పేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్‌ను భారీ మెజారిటీతో గెలిపించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. గులాబి పార్టీలో చేరిన వారిలో టీడీపీ నగర నాయకులు రాచర్ల భాస్కర్, నల్ల అనిల్ కుమార్, సత్యనారాయణ, రాహుల్ యాదవ్, మధుసూదన్, సుభాష్ నాయక్, రఘు, నారాయణ, దుర్గ ప్రసాద్, ఫిలిప్స్ మహ్మద్ కాలిద్, బాలాజీ, శివ, హర్షవర్ధన్, సాయి మనీష్, విట్టల్ ప్రవీణ్, రాజేష్, శ్రీనివాస్, సూరత్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానందనగర్‌లో ఇళ్లను తొలగిస్తే సహించం

గాంధీనగర్ కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్



వివేకానందనగర్‌వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావని

చిక్కడపల్లి: స్వామి వివేకానందనగర కాలనీలోని ఇళ్లను తొలగిస్తే సహించమని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావని వినయ్‌కుమార్ హెచ్చరించారు. ఇళ్లను కాపాడుకోవడానికి అవసరమైతే అధికారులు, ప్రభుత్వంతో యుద్ధం చేస్తామని ఆమె పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం డివిజన్‌లోని స్వామి వివేకానందనగర్ కాలనీని ఆమె బీజేపీ నాయకులతో కలసి సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు తాము ఆరు దశాబ్దాలుగా ఇక్కడే నివసిస్తున్నామన్నారు. 23 ఇళ్లున్నాయని తెలిపారు. అయిదు ఇళ్ల రిజిస్ట్రేషన్ కూడా అయ్యాయరన్నారు. అన్ని ఇండ్లవారు ప్రాపర్టీ టాక్స్, కరెంట్, మంచినీటి కనెక్షన్లు కలిగి ఉన్నారని బిల్లులు సైతం చెల్లిస్తున్నారని తెలిపారు. బుధవారం ఉదయం జీహెచ్‌ఎంసీ సర్కిల్ 15 టౌన్‌ప్లానింగ్ అధికారులు సిబ్బంది తమ కాలనీకి వచ్చి రెండురోజుల్లో ఇళ్లను ఖాళీ చేయాలని లేదంటే కూల్చివేస్తామని హెచ్చరించిపోయారని గోడును విలపించారు. స్పందించిన కార్పొరేటర్ పావని మాట్లాడుతూ... ఈ కాలనీ ఇండ్ల సమస్య ఇప్పటికే కోర్టులో ఉందని కోర్టు కేసులో ఉండగా ఎలా మున్సిపల్ వారు వచ్చి ఇండ్లు కూల్చేస్తాం పై నుంచి ఆర్డర్స్ అంటూ ఎలా బెదిరిస్తారని మండిపడ్డారు. ఇండ్లను, ఆలయాలు, ప్రార్థన మందిరాలను తొలగిస్తే చూస్తూ ఊరుకోవడానికి ఇక్కడ ఎవరూ సిద్ధంగా లేరన్నారు. బీజేపీ నాయకులు వినయ్‌కుమార్, ఆనంద్‌రావు, సాయి చంద్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి పలువురి రాజీనామా

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లో తమ రాజీనామాలతో ఝలక్ ఇచ్చారు. ఓబీసీ మోర్చా గీతా సెల్ రాష్ట్ర కోకన్వీనర్ బి.యాదగిరిగౌడ్ రాజీనామా చేయడంతో ఆయనకు మద్దతుగా దాదాపు 150 మంది పార్టీ నుంచి వెళ్లిపోయేందుకు తీర్మానించుకున్నారు. ఈ మేరకు బుధవారం బాపునగర్, వివేక్‌నగర్, జవహర్‌నగర్‌లలో పార్టీ శ్రేణులు యాదగిరిగౌడ్‌తో సమావేశమయ్యారు. పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. నేతలు శంకర్‌గౌడ్, గణేశ్, మనోహర్, ప్రకాష్, వినోద్, శివ, శివశంకర్‌గౌడ్, ఓపాల్‌గౌడ్, కె.యాదయ్య, పవన్‌కళ్యాణ్, రంజిత్, లక్ష్మి, అనిత, లీల, భారతి, పద్మ తదితరులు పాల్గొన్నారు. రెండు మూడు రోజుల్లో ఏ పార్టీలో చేరే విషయాన్ని ప్రకటిస్తామని వారు తెలిపారు.

కాంగ్రెస్‌కు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని వినతి



లిబర్టీ: శాసన సభ ఎన్నికల్లో మద్దతు ఇవ్వాలని నిజాం వారసులు మెహబూబ్ అలంఖాన్‌కు మండడి అంజన్‌కుమార్‌యాదవ్ విజ్ఞప్తి చేశారు. మహబూబ్ అలంఖాన్ మాట్లాడుతూ... అసెంబ్లీ ఎన్నికల్లో తన సంపూర్ణ మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ నాయకులు మాజీద్, రెహమాన్ పాల్గొన్నారు.

11న క్రైస్తవ వివాహ పరిచయ వేదిక

కాచిగూడ: ఇండియా క్రిస్టియన్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 11వ తేదీన లక్డీకాపూల్‌లోని లూతెరన్ చర్చ్‌లో క్రైస్తవ వివాహ పరిచయ వేదికను నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు డాక్టర్ ఎస్.అబ్రహాం తెలిపారు. దేశ వ్యాప్తంగా క్రైస్తవ వధూవరులు ఈ పరిచయ వేదికలో పాల్గొంటారని తెలిపారు. వివరాలకు 888 50 73555లో సంప్రదించాలని ఆయన కోరారు.

పటాన్‌చెరు టికెట్ కోట శ్రీనివాస్‌గౌడ్‌కే కేటాయించాలి

కవాడిగూడ: పటాన్‌చెరు టికెట్‌ను కాంగ్రెస్ పార్టీ స్థానిక బీసీ నేత కోట శ్రీనివాస్‌గౌడ్ కే టాయించాలని బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటి కొండ విక్రమ్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం దోమలగూడలోని బీసీ భవన్‌లో బీసీ విద్యార్థి సంఘం జాతీయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీనే నమ్ముకుని నిస్వార్థంగా ప్రజలకు సేవలు చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్ ఈ ఎన్నికల్లో గెలుస్తాడనే భయంతో కాంగ్రెస్ పార్టీకి చెందిన సంఘారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి కుట్రలు చేసి టికెట్ రాకుండా అడ్డుకుంటున్నాడన్నారు. జగ్గారెడ్డి బీసీ వ్యతిరేక వైఖరిని మానుకోవాలని ఆయన హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీలో గెలుపుగుర్రమైన శ్రీనివాస్ గౌడ్ ఉండగా ఇంకో బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి నీలం మధుకు పటాన్‌చెరు టికెట్ కేటాయించడం అంటే అంతిమంగా బీఆర్ఎస్ అభ్యర్థి గూడం మహిపాల్‌రెడ్డిని గెలిపించాలనే కుట్రతోనే ఇదంతా చేస్తున్నారని మండిపడ్డారు. ఇద్దరు బీసీల మధ్య చిచ్చుపెట్టి ఒక అగ్రకుల అభ్యర్థికి మేలు జరిగేలా జగ్గారెడ్డి వ్యవహరిస్తున్నారని ఆయన విమర్శించారు. బీసీలపై చిత్తశుద్ధి ఉంటే నీలం మధుకు జగ్గారెడ్డి సంఘారెడ్డి సీటును త్యాగం చేసి ఇవ్వాలని ఆయన సూచించారు. కోట శ్రీనివాస్‌గౌడ్‌కు టికెట్ దక్కేలా రాహుల్ గాంధీ జోక్యం చేసుకోని తక్షణమే బీఫాం ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీకి బీసీలు తగిన గుణపాఠం చెప్పడనికి సిద్ధంగా ఉన్నారని ఆయన హెచ్చరించారు. బీసీ సంఘాల నేతలు పాలకూరి కిరణ్, కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి ఓటు ఎందుకు వేయాలి?

- మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్
- ముఠా గోపాల్‌కు మద్దతుగా పార్సిగుట్టలో ప్రచారం



ముషీరాబాద్: కాంగ్రెస్ పార్టీకి ఎందుకు ఓటు వేయాలని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ ప్రశ్నించారు. బుధవారం ముషీరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి ముఠా గోపాల్‌కు మద్దతుగా పార్సిగుట్టలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ప్రాంతాలలో మహిళలు మంగళహారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... 130 సంవత్సరాల చరిత్ర కలిగిన పార్టీ అని చెప్పుకునే కాంగ్రెస్ దేశంలో, రాష్ట్రంలో 40 సంవత్సరాల పాటు అధికారంలో ఉండి ప్రజలకు ఏమి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. అధికారంలో ఉన్నంత కాలం పదవుల కోసం సొంత పార్టీ నేతల మధ్యే అంతర్గత కుమ్ములాటలకే పరిమితమై అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. ఇప్పుడు మరో అవకాశం ఇవ్వాలంటూ ఏ మోహం పెట్టుకోని వస్తున్నారని ధ్వజమెత్తారు. ఆరు గ్యారంటీల పేరుతో వచ్చే కాంగ్రెస్ పార్టీని ఈ ఎన్నికల్లో ప్రజలు బొందపెడతారని జోష్యం చెప్పారు. మూడు నెలల ముందే అభ్యర్థులను ప్రకటించిన దమ్మున్న నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కాంగ్రెస్, బీజేపీలలో అభ్యర్థుల ఎంపిక ఇంకా పూర్తి కాలేదని ఎద్దేవ చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో దళిత బంధు, బీసీ బంధు, కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి అనేక పథకాలను అందిస్తున్నట్లు వివరించారు. పేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించి ఉచితంగా పంపిణీ చేస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రంలో అత్యధిక సంక్షేమ పథకాలు అమలు అవుతున్నాయని తెలిపారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన తరువాత 400 రూపాయలకే వంట గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తామని, రేషన్ ద్వారా సన్నబియ్యం పంపిణీ, 15 లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సేవలు అందుబాటులోకి తేస్తామన్నారు. ఐదు వేల రూపాయల వరకు ఫించన్‌లు ఇస్తామని తెలిపారు. ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉందని మరోసారి ఆయనను ప్రజలు ఆశీర్వదించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వెస్ట్ పార్సిగుట్ట నుంచి ప్రారంభమైన పాదయాత్ర గంగపుత్ర కాలనీ, మోరంబొంద, కళాదర్‌నగర్, చాపల మార్కెట్, పటాన్ బస్తీ తదితర ప్రాంతాల గూండా సాగి గంగపుత్ర సంఘం కార్యాలయం వరకు చేరుకుంది. ముఠా జైసింహ, వి.శ్రీనివాస్‌రెడ్డి, హరిబాబుయాదవ్, కొండపల్లి మాధవ్, శివ ముదిరాజ్, బల్లా ప్రశాంత్, నర్సింగ్‌ప్రసాద్, టెంట్‌హౌజ్ శ్రీనివాస్, జి.గోవింద్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేట కాంగ్రెస్ అభ్యర్థి భారీ ర్యాలీ

నల్లకుంట: కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సి. రోహిణ్‌రెడ్డి బుధవారం ఉదయం నల్లకుంట డివిజన్ పరిధిలోని రత్నానగర్ వద్ద ఉన్న ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన ఎన్నికల నామినేషన్ వేసేందుకు వేలాదిగా తరలి వచ్చిన నాయకులు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా అంబర్‌పేట తహసీల్దార్ కార్యాలయానికి తరలి వెళ్లారు. ఈ సందర్భంగా రత్నానగర్ హుస్సేన్ నాలా నుంచి చే నంబర్ చౌరస్తా వరకు కార్యకర్తలు, మద్దతుదారులు బారులు తీరారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలంటూ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా లా అండర్ ఆడర్, ట్రాఫిక్ పోలీసులు పెద్ద ఎత్తున గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ర్యాలీలో టీపీసీసీ కార్యదర్శి ఎ. లక్‌పతి యాదగిరి గౌడ్, గ్రేటర్ కాంగ్రెస్ కమిటీ ఉపాధక్షుడు కె. గోవర్ధన్ రెడ్డి, లక్ష్మణ్ యాదవ్, శంబుల శ్రీకాంత్ గౌడ్, గ్రేటర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు మోత రోహిత్, బాగ్ అంబర్‌పేట మాజీ కార్పొరేటర్ నారాయణ స్వామి, నాయకులు ధనార్జన్ రెడ్డి, కేపీ మురళీకృష్ణ, నర్సింహా రెడ్డి, ఎ.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383